తెలంగాణ TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం-23- ఏప్రిల్ 2025 | సంపుటి : 2 | సంచిక : 300 | పేజీలు - 6 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడి

## 27మంది టూరిస్టులు మృతి

ఆర్మీ దుస్తుల్లో వచ్చి టూరిస్టులపై కాల్పులు

- పర్యాటకులపై ఉగ్ర దాడి.. కాల్పులకు 27 మంది బలి
- 20 మందికి పైగా గాయాలు..
- ముష్కరులను వదలబోం: మోదీ..
- సౌదీ నుంచి అర్ధాంతరంగా వెనక్కి
- హుటాహుటిన కశ్మీర్‌కు అమిత్ షా..
- వాన్స్ పర్యటిస్తుండగానే ఘటన

న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు):

అందాల కశ్మీరం ఎరుపెక్కింది. ఉగ్ర ఉన్మాదం మరోసారి ఒళ్లువిరుచుకుంది. పర్యాటకులపై తూటాల వర్షం కురిసింది. వారిపై ఉగ్ర ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాంలోని బైసారన్ ప్రాంతంలో

మిగతా 2లో..





## సివిల్స్‌లో శక్తి టాపర్

- టాప్–5లో ముగ్గురు అమ్మాయిలే
- హర్షితా గోయల్‌కు రెండో ర్యాంక్, షా మార్గీకి నాలుగో ర్యాంక్

న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు):

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024 ఫలితాల్లో అమ్మాయిలు అద్భుత ప్రతిభ కనబర్చారు. ఆలిండియా ఫస్ట్ ర్యాంకుతో పాటు తొలి ఐదు ర్యాంకుల్లో ఏకంగా మూడు ర్యాంకులు కైవసం చేసుకున్నారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన శక్తి దూబే ఫస్ట్ ర్యాంకు సాధించగా హర్షితా గోయ ల్ రెండో ర్యాంకు, షా మార్గీ చిరాగ్ నాలుగో ర్యాంకు సాధించారు. అబ్బాయిల్లో డోంగ్రే అర్చిత్ పరాగ్ మూడో ర్యాంకు, ఆకాశ్ గార్గ్ ఐదో ర్యాంకు సాధించారు.

తొలి 25 ర్యాంకుల్లోనూ 11 ర్యాంకులను అతివలు సాధించి తమ సత్తా చాటారు. అలాగే టాప్-25లో ఇద్దరు తెలుగువాళ్లు ర్యాంకులు సాధించారు. తొలి 1,009 ర్యాంకుల్లో 725 మంది పురుషులు, 284 మంది మహిళలు ఉన్నారు. పరీక్షల్లో విజయం సాధించిన వారిలో జనరల్ కేటగిరీ నుంచి 335 మంది ఎంపికవగా ఆర్థికంగా వెనకబడిన వర్గాల నుంచి 109 మంది ఎంపికయ్యారు. ర్యాంకర్లలో 318 మంది బీసీలు, 160 మంది ఎస్సీలు, 87 మంది ఎస్టీలు ఉన్నారని యూపీఎస్సీ తెలిపింది. మొత్తంగా 1,129 ఖాళీలు ఉన్నట్లు కమిషన్ గతంలో పేర్కొంది. వాటిలో 180 ఐఏఎస్, 55 ఐఎఫ్ఎస్, 147 ఐపీఎస్, 605 గ్రూప్-ఏ పోస్ట్‌లు, 142 గ్రూప్-బీ పోస్ట్‌లు ఉన్నాయి.

### భిన్న నేపథ్యాలు..

ఆలిండియా టాపర్‌గా నిలిచిన శక్తి దూబే ఎటువంటి కోచింగ్ తీసుకోకుండానే ఐదో

మిగతా 2లో..


## హిరోషిమా అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఆ నగరం మాదిరే పోరాటానికి చిహ్నం తెలంగాణ అని వెల్లడి
- అక్కడి పీస్ మెమోరియల్ పార్క్ వద్ద నివాళి
- ముగిసిన సీఎం బృందం జపాన్ పర్యటన.. నేడు హైదరాబాద్‌కు రాక

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

'ప్రజలు సమష్టిగా పనిచేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి చూపించిన నగరం హిరోషిమా. హిరోషిమా మాదిరిగానే ప్రజల ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ. దూరదృష్టితో విజయం సాధించిన రాష్ట్రం తెలంగాణ. హిరోషిమా నగరానికి రావడం ఎంతో ఆనందంగా ఉంది'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిరోషిమా అసెంబ్లీలో మాట్లాడుతూ పేర్కొన్నారు.

మిగతా 2లో..





## రేవంత్ రెడ్డి రాజీనామా రాయాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్ర ముఖ్యమంత్రిగా, హోం మినిస్టర్‌గా, కొడంగల్ ఎమ్మెల్యేగా లగచర్లలో పోలీసులు చేసిన దౌర్జన్యానికి బాధ్యత తీసుకొని.. సిగ్గు ఉంటే ముక్కు నేలకి రాసి రేవంత్ రెడ్డి రాజీనామా రాయాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్సీ సంచలన విషయాలు బయటపెట్టారు. లగచర్ల రైతులను కొట్టి, శారీరకంగా హింసించారని జాతీయ మానవ

మిగతా 2లో..



## ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిల హవా..

- ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణతలో బాలురపై పైచేయి
- ఫస్టియర్ బాలురు 57.83%.. బాలికలు 73.83%..
- సెకండియర్ బాలురు 57.31%.. బాలికలు 74.21% ఉత్తీర్ణత
- మొత్తంగా రెండేళ్లూ కలిపి 65.81 శాతం ఉత్తీర్ణత నమోదు
- ఫలితాలు విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


2లో..

## దంచి కొడుతున్న ఎండలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు): ఎండలతో అడవుల జిల్లా ఆదిలాబాద్ ఉడికిపోతోంది. మంగళవారం ఉష్ణోగ్రత సాధారణం కన్నా ఏకంగా 3.4 డిగ్రీలు పెరిగి 44.3 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఈ ఏడాదికి ఇదే రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత. నిజామాబాద్‌లోనూ సాధారణం కన్నా 3.1 డిగ్రీలు పెరిగి 44 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఖమ్మం, నల్గొండలలో 2.2 డిగ్రీలపైన ఎండ పెరిగింది.


మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు: రాష్ట్రంలో ఎండలు మరింత పెరగనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. 23న ఉమ్మడి ఆదిలాబాద్, 24, 25వ తేదీల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు

మిగతా 2లో..



## పార్లమెంటే సుప్రీం

- దాన్ని మించిన అథారిటీ లేదు: ధన్‌ఖడ్
- ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్లు
- సుప్రీంకోర్టు పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు
- వ్యవస్థలు పరిధి మీరితే ఉపేక్షించొద్దు
- జాతి ప్రయోజనాల కోసమే మాట్లాడా



న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు):

ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. మన దేశంలో పార్లమెంటే సర్వోన్నతమని పునరుద్ఘాటించారు. "దాన్ని మించిన అధికారాన్ని మన రాజ్యాంగం మరే అథారిటీకీ ఇవ్వలేదు. కనీసం అలాంటి భావనకు కూడా చోటివ్వలేదు. ఆ మాటకొస్తే దేశంలోని ప్రతి పౌరుడూ సుప్రీమే. 'దేశ ప్రజలమైన మేము' అంటూ రాజ్యాంగంలో రాసుకున్న మాట అణుబాంబు వంటిది. దానికున్న శక్తి ఎంతటిదో ప్రతి ఎన్నికల్లోనూ కనిపిస్తుంది" అంటూ కుండబద్దలు కొట్టారు. "రాజ్యాంగపరమైన అంశాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్.

రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కూడా వారిదే" అని స్పష్టం చేశారు. "రాష్ట్రపతి వంటి ఉన్నత రాజ్యాంగ పదవులు అలంకారప్రాయమైనవి మాత్రమేనని కొందరంటున్నారు. ఇది పూర్తి తప్పుడు అవగాహన.

మిగతా 2లో..



## జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం

న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలుగు చిత్రాలను మాత్రమే కాదు.. ఉర్దూ చిత్రాలనూ ప్రోత్సహిస్తామని తెలిపారు. గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డులపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ గుండె చప్పుడును తన పాటల ద్వారా విశ్వవ్యాప్తం చేసిన గొప్ప వ్యక్తి గద్దర్. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ గద్దర్ బాణి, పాటలను అనుకరిస్తారు. గద్దర్ తన పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశారు. ఆయన పేరు మీద అవార్డులు ప్రదానం చేయడం హర్షణీయం. హైదరాబాద్‌లో జరిగే చలన చిత్ర అవార్డులు ఘనంగా నిర్వహించాలి. అందుకు కావాల్సిన సహాయ సహకారాలను ప్రభుత్వం నుంచి అందిస్తాం" అని అన్నారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ దారుణానికి 26 మంది పర్యాటకులు బలయ్యారు. 20 మందికి పైగా గాయపడ్డారు.
మృతుల్లో ఇద్దరు విదేశీయులున్నారు. వారిలో ఒకరు నేపాలీ కాగా మరొకరిది యూఏఈ. మరో ఇద్దరు స్థానికులు కాగా మిగతావారు కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్, యూపీ, బిహార్ తదితర రాష్ట్రాలకు చెందినవారు.
2019లో పుల్వామాలో సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై టెర్రరిస్టులు కాల్పులకు దిగి 47 మందిని పొట్టన పెట్టుకున్న అనంతరం కశ్మీర్‌లో జరిగిన అతి పెద్ద దాడి ఇదే. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇది తమ పనేనని పాకిస్తాన్‌కు చెందిన నిషేధిత ఉగ్ర సంస్థ లష్కరే తొయిబా తాలూకు ముసుగు సంస్థ ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ప్రకటించుకుంది. ప్రధాని నరేంద్ర మోదీతో సహా పార్టీలకు అతీతంగా నేతలంతా దాడిని ముక్త కంఠంతో ఖండించారు. ఉగ్రవాదుల ది మతిలేని ఉన్మాదమంటూ మోదీ మండిపడ్డారు. "ఈ హేయమైన దాడికి పాల్పడ్డ వారిని వదిలే ప్రసక్తే లేదు. వారందరినీ చట్టం ముందు నిలబెడతాం. ముష్కరుల కుటిల అజెండా ఫలించబోదు. ఉగ్రవాదంపై రాజీలేని పోరు జరపాలన్న మా సంకల్పం మరింత బలపడింది'' అని ప్రకటించారు. "మృతుల కుటుంబీకులకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడ్డ వారు వెంటనే కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. బాధితులందరికీ అన్నివిధాలా సాయం అందజేస్తున్నాం'' అని ప్రధాని పేర్కొన్నారు. సౌదీ అరేబియాలో ఉన్న ఆయన విషయం తెలియగానే పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని భారత్ తిరిగొచ్చారు. అంతకుముందు సౌదీ నుంచే కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడారు. అనంతరం కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ దేకా తదితర ఉన్నతాధికారులు, ఢిల్లీలో ఉన్న జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తదితరులతో షా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.
ఆ వెంటనే ప్రధాని సూచన మేరకు వారందరితో కలిసి మంగళవారం రాత్రే ప్రత్యేక విమానంలో హుటాహుటిన కశ్మీర్ చేరుకున్నారు. రాజ్‌భవన్‌లో పరిస్థితిని సమీక్షించారు. "తాజా పరిస్థితిని మోదీకి నివేదించా. ఉగ్ర దాడి నన్ను తీవ్రంగా కలచివేసింది. దాడికి తెగబడ్డవారిని వదిలే ప్రసక్తే లేదు. వారి వెనకున్న సూత్రధారులను కూడా ఉక్కుపాదంతో అణచివేస్తాం'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన బుధవారం ఘటనాస్థలిని సందర్శించనున్నారు. ఇది కనీవినీ ఎరగని పిరికిపంద చర్య అంటూ జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మండిపడ్డారు. ఉగ్రవాదుల కోసం పహల్గాం,



పరిసర ప్రాంతాలన్నింటినీ భద్రతా దళాలు జల్లెడ పడుతున్నాయి.
జమ్మూ కశ్మీర్ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు కుటుంబసమేతంగా భారత్‌లో పర్యటిస్తున్న వేళ ఈ దాడి జరగడం గమనార్హం. దీన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా ఖండించారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రవాదంపై రాజీలేని పోరులో భారత్‌కు పూర్తిగా వెన్నుదన్నుగా నిలుస్తామని నేతలిద్దరూ పునరుద్ఘాటించారు. "కశ్మీర్ దారుణం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఈ విషయంలో ప్రధాని మోదీకి, భారత పౌరులకు అన్నివిధాలా మద్దతుగా ఉంటాం'' అని ట్రంప్ తన సోషల్ మీడియా హ్యాండిల్ ట్రూత్‌సోషల్‌లో పేర్కొన్నారు. ఈ దాడిని దారుణ నేరంగా పుతిన్ అభివర్ణించారు.

**పెళ్లయిన 6 రోజులకే నూరేళ్లు నిండాయి**
**కాల్పుల్లో భర్తను కోల్పోయిన నవవధువు**

పెళ్లయి కాళ్లకు పారాణి ఆరకముందే ఆ నవవధువు జీవితం తలకిందులైంది. భర్తను ఉగ్రవాదులు పొట్టనపెట్టుకోవడంతో ఆ నవవధువు తన భర్త మృతదేహాన్ని పట్టుకుని దిక్కులు పిక్కటిల్లేలా ఏడ్చింది. ఈ యువజంట ఏ రాష్ట్రానికి చెందినవాళ్లు అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. "మాకు పెళ్లయి కేవలం ఆరు రోజులే అవుతోంది. ఘటన జరిగినప్పుడు మేమిద్దరం పానీపూరీని ఆస్వాదిస్తున్నాం.
హఠాత్తుగా ఒక ఉగ్రవాది మా వద్దకు వచ్చాడు. నీ భర్త ముస్లింకాదుకదా అని అన్నాడు. వెంటనే ఆయన తలకు తుపాకీ గురిపెట్టి కాల్చి వెళ్లిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న నా భర్తను ఎవరైనా కాపాడండి''అంటూ ఆ మహిళ ఏడుస్తున్న హృదయ విదారక వీడియో దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతున్నాయి.







# హిరోషిమా అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

జపాన్ పర్యటనలో చివరి రోజైన మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో కూడిన తెలంగాణ రైజింగ్ బృందం బిజీబిజీగా గడిపింది.
రెండో ప్రపంచ యుద్ధంలో భాగంగా 1945 ఆగస్టు 6న అమెరికా జరిపిన అణు బాంబు దాడిలో నామరూపాల్లేకుండా ధ్వంసమైన హిరోషిమా నగరంలో సీఎం రేవంత్ బృందం పర్యటించింది. వివిధ ప్రాంతాలను సందర్శించడంతోపాటు పలువురు వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది.
తొలుత హిరోషిమా ప్రిఫెక్చురల్ (రాష్ట్ర ప్రభుత్వం) అసెంబ్లీకి రేవంత్ బృందం విచ్చేయగా వారికి స్పీకర్ తకాషి నకమోటో, శాసనసభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ 'శాంతి, స్థిరత్వం, సమృద్ధి లాంటి విలువలను పంచుకుందాం.
పెట్టుబడులకు పరస్పర సహకారం, భాగస్వామ్యం గురించి మాట్లాడటానికి వచ్చాం. కలసికట్టుగా మెరుగైన, పచ్చని, సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మిద్దాం'అని అక్కడి ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే 50కిపైగా జపాన్ కంపెనీలు తెలంగాణలో పనిచేస్తున్నాయని.. మరిన్ని కంపెనీలను ఏర్పాటు చేయాలని అక్కడి పారిశ్రామికవేత్తలను కోరారు. తెలంగాణను సందర్శించి రాష్ట్ర ప్రగతిని స్వయంగా చూడాలని హిరోషిమా ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.
అలాగే హిరోషిమా డిప్యూటీ గవర్నర్‌తో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఆ తర్వాత హిరోషిమా చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం హిరోషిమా పీస్ మెమోరియల్ పార్క్, అణుబాంబు డోమ్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు నివాళులర్పించారు. ఆపై అక్కడి గాంధీ మెమోరియల్ వద్ద పుష్పాంజలి ఘటించారు. జపాన్ పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్ బుధవారం హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు.


**పెట్టుబడులు రూ. 12,062 కోట్లు.. 30,500 ఉద్యోగాలు**

జపాన్ పర్యటనలో రూ. 12,062 కోట్ల పెట్టుబడులు, 30,500 ఉద్యోగాల సృష్టికి ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇందులో అత్యధికంగా ఎన్‌టీటీ డేటా-నెయిసా నెట్‌వర్క్స్ హైదరాబాద్‌లో రూ. 10,500 కోట్ల పెట్టుబడితో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుందని పేర్కొంది. అలాగే మారుబెని కంపెనీ రూ. వెయ్యి కోట్ల ప్రారంభ పెట్టుబడి ద్వారా హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్‌ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుందని.. మొత్తంగా రూ. 5,000 కోట్ల పెట్టుబడుల అంచనాతో 30 వేల ఉద్యోగాల కల్పనకు ముందుకొచ్చిందని ప్రభుత్వం వెల్లడించింది.
తోషిబా అనుబంధ కంపెనీ టీటీడీఐ హైదరాబాద్ శివార్లలో మూడో విద్యుత్ పరికరాల ప్లాంట్ ఏర్పాటు కోసం రూ. 562 కోట్ల పెట్టుబడి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకుందని వివరించింది. టామ్‌కాతో కుదిరిన ఒప్పందం ద్వారా 500 ఉద్యోగాలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రభుత్వం చెప్పింది.

# దంచి కొడుతున్న ఎండలు

(మొదటి పేజీ తరువాయి)

నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో వడ గాలులు వీస్తాయని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఈ జిల్లాలకు 'పసుపు' రంగు ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది. ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు మీదుగా మన్నార్ వరకు ఉపరితల చక్రవాతపు ఆవర్తనం కొనసాగుతున్నట్లు తెలిపింది. బుధ, గురువారాల్లో కొన్ని జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది.



# సివిల్స్‌లో శక్తి టాపర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నంలో ర్యాంక్ సాధించగా రెండో ర్యాంకర్ హర్షితా గోయల్ మూడో ప్రయత్నంలో సివిల్స్‌కు ఎంపికైంది. ఆమె ప్రస్తుతం చార్టర్డ్ అకౌంటెంట్‌గా ప్రాక్టీస్ చేస్తోంది. ఇక మూడో ర్యాంక్ సాధించిన 26 ఏళ్ల డోంగ్రే అర్చిత్ పరాగ్ స్వస్థలం మహారాష్ట్రలోని పుణే. అతను తమిళనాడులోని వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు.

# జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు పేర్కొన్నారు. హెచ్ఐసీసీ వేదిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం ఇస్తున్న ఈ పురస్కారాల ఎంపిక కోసం 15 మంది సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. జ్యూరీ కమిటీకి ఛైర్మన్‌గా నటి జయసుధ (Jayasudha)ను ఎంపిక చేశారు. అన్ని విభాగాల్లో 1248 నామినేషన్లు రాగా వ్యక్తిగత కేటగిరీలో 1172, ఫీచర్ ఫిల్మ్, చిల్డ్రన్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీ, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర కేటగిరిల్లో 76 దరఖాస్తులు అందినట్టు ఇటీవల వెల్లడించారు. అవార్డుల కోసం దరఖాస్తు చేసిన నామినేషన్లను ప్రస్తుతం జ్యూరీ సభ్యులు పరిశీలిస్తున్నారు.

# ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిల హవా..

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):** ఇంటర్మీడియెట్ ఫలితాల్లో బాలికలు అత్యధిక శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో బాలురు 57.83 శాతం పాసయితే, బాలికలు ఏకంగా 73.83 శాతం ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలుర ఉత్తీర్ణత శాతం 57.31 ఉంటే, బాలికల ఉత్తీర్ణత శాతం దాదాపుగా ఫస్టియర్ మాదిరే 74.21 శాతం నమోదైంది.
మొత్తంగా (రెండేళ్ళు కలిపి) ఈ ఏడాది ఇంటర్ ఉత్తీర్ణత 65.81గా నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు 5%ఎక్కువ.
ఆసిఫాబాద్‌లో అత్యధిక శాతం ఉత్తీర్ణత మార్చి 5 నుంచి 25వ తేదీల మధ్య ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల ఫలితాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం ఇంటర్ బోర్డు కార్యాలయంలో విడుదల చేశారు. ఇంటర్ పరీక్షలకు రెండు సంవత్సరాలకు కలిపి 9,97,012 మంది హాజరయ్యారని, వీరిలో 6,56,099 మంది పాసయ్యారని భట్టి తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో అత్యధిక శాతం ఉత్తీర్ణత నమోదు చేసిందని తెలిపారు.
కాగా ఫస్టియర్‌లో మహబూబాబాద్, సెకెండియర్‌లో కామారెడ్డి అతితక్కువ ఉత్తీర్ణత నమోదు చేశాయని ఆయన వివరించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగిరాణా, సీజీజీ డీజీ రాజేంద్ర నిమ్జే, ప్రత్యేక కార్యదర్శి హరిత, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరీక్ష విభాగం ముఖ్య అధికారి జయప్రదాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటే సుప్రీం

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి వ్యవస్థకూ తనవైన బాధ్యతలున్నాయి. ఇలా వాటి ప్రతిష్టను మసకబార్చజూస్తున్న దేశ వ్యతిరేక శక్తుల ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వరాదు'' అని అభిప్రాయపడ్డారు. మంగళవారం ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. సుప్రీంకోర్టు పరిధులు దాటి వ్యవహరిస్తోందన్న తన వ్యాఖ్యలను పూర్తిగా సమర్థించుకున్నారు. వాటిని తప్పుబట్టిన వారిపై విరుచుకుపడ్డారు.
రాజ్యంగ హోదాలో ఉండే వ్యక్తులు మాట్లాడే ప్రతి మాటకూ దేశ అత్యున్నత ప్రయోజనాలే పరమావధి అని గుర్తుంచుకోవాలన్నారు. "సుప్రీంకోర్టు పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు చేసిన సందర్భాలెన్నో ఉన్నాయి. ప్రవేశిక రాజ్యాంగంలో భాగం కాదని ఒక కేసులో, భాగమేనని మరో కేసులో పేర్కొంది. వ్యవస్థలు తమ రాజ్యాంగ పరిధిని మీరినప్పుడు మౌనం వహించడం ప్రమాదకరం. వీటిపై మేధావులు స్పందించాలి. ఆస్తులను ధ్వంసం చేసే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తులను ఏరిపారేయాలి. నయానాభయానా వినని వారికి చేదుమందు తినిపించక తప్పదు. భారతీయత పట్ల ప్రతి ఒక్కరూ గర్వించాలి'' అన్నారు.

**రాజ్యాంగమే సుప్రీం: సిబల్**

ధన్‌ఖడ్ తాజా వ్యాఖ్యలపై రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మరోసారి



తీవ్రంగా తప్పు బట్టా రు. పార్లమెంటు, కార్య నిర్వాహక వ్యవస్థల్లో ఏదీ సుప్రీం కాదని, రాజ్యాంగమే సర్వోన్నతమని అన్నారు. రాష్ట్రపతికి గడువు విషయంలో జాతి ప్రయో జనార్థం రాజ్యాంగ విలువలకు అనుగుణంగానే సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందన్నారు. 'చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు, రాజ్యాంగానికి సరైన భాష్యం చెప్పి పరిపూర్ణ న్యాయం అందించాల్సిన బాధ్యత సుప్రీంకోర్టుకు ఉన్నాయి'' అని ఆర్టికల్ 142ను ఉటంకిస్తూ చెప్పారు. ఉపరాష్ట్రపతి స్థాయి వ్యక్తి ఇలా రాజకీయ వ్యాఖ్యలు చేయడం ఎన్నడూ చూడలేదంటూ ధన్‌ఖడ్ గత వ్యాఖ్యలపై కూడా సిబల్ మండిపడటం తెలిసిందే.



## వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో తెలంగాణ ముచ్చట్లు:** క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళ వారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రేగోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రక్త పరీక్ష కేంద్రం, మందులు నిల్వ చేయు స్టోర్ రూమ్, ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించి వైద్యాధికారికి వైద్య సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆరోగ్య కేంద్రంలో ఎండ వేడిమి కారణంగావడదెబ్బ తగిలి. ఆస్పత్రికి చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఆశా కార్యకర్తలతో కలెక్టర్ పలు సూచనలు వేస్తూ ఎండ వేడిమికి వడ దెబ్బలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో వడ దెబ్బలు, ఇతర సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వివరించారు. వడదెబ్బ తగిలిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రజలు తగినన్ని మంచినీరు తీసుకోవాలని ఎండలకు ఎంతో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళవద్దని, ముఖ్యంగా ఉపాధి హామీ పథకం పనిచేసే కూలీలు పనిచేసే ప్రాంతంలో త్రాగునీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఉపాధి హామీ పని వేళలు ఉదయం 06.00 గంటల నుండి 11 గంటల వరకు ముగించాలని, సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు వెడల్పు,సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తాం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:** హనుమకొండ కరీంనగర్ ప్రధాన రహదారిలోని హసన్ పర్తి ఎమ్మార్వో ఆఫీస్ నుండి సీతంపేట క్రాస్ రోడ్డు వరకు నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఉండడంతో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపి రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం 2కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు తెలిపారు. హసన్ పర్తి మండల ఎమ్మార్వో ఆఫీస్ నుండి ఎల్లాపూర్ గ్రామం వరకు జరిగే రోడ్డు ప్రమాదాలలో చాలామంది మరణిస్తున్నారని స్థానికుల అభ్యర్థన మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో వివరాలు తెప్పించుకొని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో వెంటనే స్పందించి రోడ్డు ప్రమాదాల నుంచి కాపాడేందుకు తక్షణమే రెండు కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ మేరకుమంగళవారం రోజున వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు,కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి,నగర మేయర్ గుండు సుధారాణి,నేషనల్ హైవే, పోలీస్,మున్సిపల్,ఎలక్ట్రికల్ అధికారులతో కలిసి స్వయంగా పర్యవేక్షించి అధికారులకు సలహాలు సూచనలు చేశారు. హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట సమీపంతో పాటు సీతంపేట క్రాస్ రోడ్ ప్రాంతాలలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూ చాలామంది మరణిస్తున్నారని రోడ్డు మార్గంలో సెంట్రల్ లైటింగ్ డివైడర్లు లేకపోవడమే ప్రమాదాలకు కారణమని ఎమ్మెల్యే దృష్టి సారించి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపి నిధులు తీసుకొచ్చి రోడ్డు వెడల్పు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని గత పాలకులు 10 సంవత్సరాలుగా ఎన్నో ప్రమాదాలు జరిగినా పట్టించుకున్న పాపాన పోలేదు కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని దూర దృష్టితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నిధులు తీసుకొస్తే బిజెపి,టీఆర్ఎస్ నాయకులు మేము తీసుకొచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పెంగిలి వెంకట్రావు నరసింహారెడ్డి, ఆత్మకూరు ఏఎంసి వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి,హసన్ పర్తి మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి,డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, అయ్యాల రాంరెడ్డి,ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్ కుమార్, మేడిపల్లి మదన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కలిసి శుభాకాంక్షలు తెలిపిన మాసనగారి నాగరాజు

**మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు,** హైదరాబాద్ లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య నివాసంలో మర్యాద పూర్వకంగా కానిసిన జాగ్జీవన్ రామ్ సమతా సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు మాసనగారి నాగరాజు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎస్సీ ఎస్టిలపై జరుగుతున్నటువంటి దడులు, కుల భాహిష్కర్నాలు, అవమానాలు, అంటరానితనం, చిన్నచూపు, అన్ని రంగాలలో అణిచివేతకు గురవుతున్నారని, స్వతంత్రం వొచ్చి ఇనెలు అయినా కులం అనే భూతం ఇంక వెంటాడుతూనే ఉంది అన్ని వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల దళిత నాయకుడిపై జరిగిన హత్యయత్నం,దాడి గురించి కుడా తెలియచేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వేంకటయ్య రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ లకు ఎక్కడ అన్యాయం జరిగిన నా దృష్టికి తీసుకురావాలన్నారు. తీసుకొస్తే వెంటనే వాటి పరిష్కరానికి తగిన చర్యలు తీసుకునేలా నేనున్నానని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బట్టి వెంకటయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎమ్మార్పీ ఎస్ సీనియర్ నాయకులు కొల్పుల రత్నన్న, మెదక్ జిల్లా జాగ్జీవన్ రామ్ సమతా సంఘం ఉపాధ్యక్షులు కొమ్ము పవన్ కుమార్, మెదక్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎమ్మార్పీ ఎస్ జిల్లా అధ్యక్షులు గరుగుల శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఆలూరరి శ్రీనివాస్, నిజాంపేట్ మండల అధ్యక్షులు స్వామి తదితరులు ఉన్నారు.



## పోషకాలతోనే పిల్లల ఎదుగుదల సాధ్యం

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** ఉద్యాన కళాశాల, మోజెర్ల అసోసియేట్ డీన్, డా. పిడిగం సైదయ్య సారథ్యంలో కళాశాల తరపునా జాతీయ సేవా పథకంలో భాగంగా పెండమందడి మండలంలోని మోజెర్ల గ్రామంలోని అంగాన్వాడి కేంద్రం లో "పోషణ పక్వాడ్" కార్యక్రమం చేయడం జరిగింది. పిల్లలు పుట్టిన తర్వాత మొదటి వెయ్యి రోజులు తీసుకోవలసిన ఆహారం మరియు వాటి యొక్క ప్రాముఖ్యత ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా 13 సంవత్సారాలున్న పిల్లలకి తల్లి పాలు ఎంతో అవసరం, ఎక్కువగా పోషకాలనిచ్చే మరియు సమతుల్యమైన ఆహారాన్ని అందిస్తేనే పోషకాహార లోపాల బారిన పడకుండా చూడవచ్చని ఉద్యాన కళాశాల అసిస్టంట్ ప్రొఫెసర్ డా. జి. విద్య తెలిపారు. గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు ప్రతి రోజు ఆహారంలో మునగ ఆకు పొడిని చేర్చుకోవాలని ఆమె సూచించారు.పోషకాలు అవగాహన కోసం అరటి పండ్లు, ఉడకబెట్టిన కోడిగుడ్లు మరియు చికీలు పంపిణీ చేశారు. ఈ కార్యమంలో కళాశాల అసిస్టంట్ ప్రొఫెసర్ కె. భాస్కర్, అంగన్ వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, యన్.యస్.యస్ వాలంటీర్లు శ్రీవన్, పవన్, అంగన్వాడి విద్యార్థులు, మహిళలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలల అక్రమ రవాణా నిర్మూలనలో ఆటో డ్రైవర్ల పాత్ర కీలకం

జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ అన్నపనేని అనిల్ చందర్రావు

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:** వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 66వ డివిజన్ హసన్ పర్తి గ్రామం జడ్ పీ ఎస్ ఎస్ పాఠశాల ప్రాంగణంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన బాలల అక్రమ రవాణా నిర్మూలనలో పాత్ర అనే అంశంపై జిల్లా స్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా అనిల్ చందర్రావు,వరంగల్ పోలీస్ కమిషనరేట్ మానవ అక్రమ రవాణా వ్యతిరేక విభాగం ఇన్స్పెక్టర్ పి.వెంకన్న హాజరై మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఆటో డ్రైవర్లు పబ్లిక్ ప్రాంతంలో ఒక నిఘా వ్యవస్థలాగా పనిచేయాలని ఎవరైనా పిల్లల్ని గాని, మహిళలనీ అక్రమంగా రవాణా చేస్తున్నట్లయితే ఈ సమాచారాన్ని తప్పనిసరిగా 100, చైల్డ్ లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. గతంలో ఆటో డ్రైవర్లు ఇచ్చిన సమాచారం ఆధారంగా అనాథ పిల్లలను,లైంగిక దాడులకు గురైన బాలలను సంరక్షించడం జరిగిందని తప్పిపోయిన పిల్లల్ని ఆటో డ్రైవర్ల సమాచారంతో తిరిగి వారి వారి తల్లి దండ్రులకు అప్పగించడం జరిగిందని తెలియజేశారు. వరంగల్ కమిషనరేట్ ను చైల్డ్ ఫ్రెండ్లీ, మహిళల పైన హింస లేని విధంగా తయారు చేయడంలో పోలీసులు ముఖ్య భూమిక పోషిస్తున్నారని కావున ప్రభుత్వం యొక్క ఎన్జీవో సంస్థలతో కలిసి అనేక ప్రజా చైతన్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎవరైనా ఆటోడ్రైవర్లు అసాంఘిక కార్యక్రమాలపట్ల,బాలల పైన వేధింపుల సమాచారాన్ని మాకు ఇచ్చినట్లయితే వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచి బాధితులను రక్షించుటకు పూర్తి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బత్తుల కరుణ,ఎర్ర శ్రీకాంత్ ,చైల్డ్ లైన్ 1098 కోఆర్డినేటర్ సింగారపు భాస్కర్,సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్, ఫైనాన్స్ మేనేజర్ ఎం.అజయ్ కుమార్, ఆటో యూనియన్ అసోసియేన్ నాయకులు ప్రభాకర్, మధు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమా దేవి, పోలీస్ సిబ్బంది రామారావు,ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.




## ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన అర్వపల్లి యువ నాగశ్రీ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు-**:రాష్ట్ర ప్రభుత్వం మంగళ వారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో అర్వపల్లి నగేష్, శ్రీలక్ష్మిల కుమార్తె యువ నాగశ్రీ అత్యున్నతమైన ప్రతిభ కనపరిచారు. నాగశ్రీ ఎంపీసీ విభాగంలో మొత్తం 1000 మార్కులకు 953 మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు. స్థానిక ఎస్ ఆర్ కాలేజ్, రోటరీ నగర్ లో విద్యను అభ్యసించిన నాగశ్రీ ఎంపీసీ మొదటి సంవత్సరం ఫలితాలలో 470 కి 463 మార్కులు సాధించి, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం లో మొత్తం 953 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు.



ఇంటర్మీడియట్ ఫలితాలలో విశేష ప్రతిభ కనబరిచిన అరవపల్లి యువ నాగశ్రీని పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, శ్రేయోభిలాషులు అభినందించారు



## సాయిస్ఫూర్తిలో వరల్డ్ క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్ డే వేడుకలు

**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:** సత్తుపల్లి మండల పరిధిలో బి. గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో వరల్డ్ క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్ డే వేడుకలు కళాశాల ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ చీపు.బాలకృష్ణ అసిస్టెంట్ ప్రొఫెసర్ మాట్లాడుతూ.. ప్రపంచ క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్ ఆవిష్కరణ దినోత్సవం అనేది ఐక్యరాజ్యసమితి సారధ్యంలో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న జరపటం జరుగుతుందని మరియు దీనిని గ్లోబల్ గోల్స్ అనికూడా పిలుస్తారని అన్నారు. అయితే ప్రపంచ క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్ అనేది విద్యార్థినీ, విద్యార్థుల్లో ఉండే సృజనాత్మకతను కొత్త కొత్త ఆవిష్కరణలను వెలికి తీయాలనే ఉద్దేశంతో వీటిని నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి. శేషారత్నకుమారి మాట్లాడుతూ.. విద్యార్థినీ, విద్యార్థులు కొత్త కొత్త వర్గాలలో మార్గాలను అన్వేషించడం లోనూ వాటిని అమలు చేయడంలోనూ ఎంతగానో ఉపయోగ పడుతుంది అని ఈ సృజనాత్మక ప్రక్రియ వివిధ దశలతో రూపొందించబడింది అని తెలియజేశారు. తయారీ, ఇంక్యుబేట్, ఇల్యూమినేషన్, మూల్యాంకనం మరియు అమలు, సృజనాత్మక ప్రక్రియ యొక్క తయారీ దశ తరచుగా పరిశోధనలను సేకరించడం మరియు లక్ష్యాలను నిర్వరీతించడం తో ప్రారంభమవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యాధికులు, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత రాజ్యసభ సభ్యులు మరియు సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ బండి. పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి. అన్విద వర్చువల్ మాట్లాడుతూ.. కళాశాల ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ విద్యార్థినీ, విద్యార్థులకు అభినందనలు తెలియజేసారు. కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి కళాశాల ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ హెడ్ మరియు కళాశాల ప్రిన్సిపాల్ డా. వూటుకూరి. శేషారత్నకుమారి కళాశాల ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ చీపు. బాలకృష్ణ అసిస్టెంట్ ప్రొఫెసర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మరియు సియస్ఈ విభాగాధిపతి డాక్టర్ షేక్.యాకూబ్, అన్నీ ఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేయండి

బిఆర్ఎస్ మండల నాయకులు గడ్డం శ్రీను



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** ఈ నెల 27వ తేదీన, వరంగల్ లోని, ఎల్కతుర్తి వద్ద నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని చింతకాని మండలం బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు గడ్డం శ్రీను అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరంగల్ లో ఈనెల 27న(ఆదివారం) నిర్వహించనున్న, బిఆర్ఎస్ రజతోత్సవ ఆవిర్భవ సభను విజయవంతం చేయ్యాలని గడ్డం శ్రీను పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. గడ్డం శ్రీను మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వరంలో, జిల్లా బీఆర్ఎస్ నాయకులు సూచన మేరకు, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్నామని అన్నారు. 24 సంవత్సరాల క్రితం స్థాపించిన బిఆర్ఎస్ 24 వసంతాలు పూర్తి చేసుకొని, 25 వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా, బిఆర్ఎస్ వరంగల్ లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు, ప్రతి ఇంటి నుండి ఒక్కరు తప్పకుండ రావాలని, లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో విద్యార్థుల పాత్ర ప్రత్యేక స్థానం ఉందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో విద్యార్థులు ప్రధాన పాత్ర పోషించారు అని గుర్తు చేశారు. అధినేత కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమిస్తే, పోరాటం మరో స్థాయికి చేరుకుందన్నారు. నాడు ఇద్దరు ఎంపీలతో కెసిఆర్ తెలంగాణ సాధించు వచ్చారని గుర్తు చేశారు. తెలంగాణలో అభివృద్ధి చేసిన చరిత్ర కేసీఆర్ దేనని, దాన్ని పాడు చేసే ఆలోచనతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. మనస్పర్థలు లేకుండా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల పని చేయ్యాలని, మీ వెంటే ఉంటామని చెప్పారు. ఏమైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే బిఆర్ఎస్ మండల కమిటీకి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి, మండల పరిధిలో అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయ్యాలని చింతకాని మండలం బిఆర్ఎస్ పార్టీ నాయకులు గడ్డం శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో చాట్ల సురేష్, చాట్ల భగవాన్, మధుసూదన్ రావు, పంది లింగయ్య, వేపూరి రాంబాబు, షేక్ గన్ను సాహెబ్, షేక్ షరీఫ్, షేక్ ఇమాం, అరికోట్ల సుమన్, అరికోట్ల పుల్లయ్య, అరికోట్ల ప్రసాద్, కనిగంటి భాస్కర్, ఎడవల్లి శ్రీను, చాట్ల నాగేశ్వరరావు, పదిలోజు రామకృష్ణ, ఎర్రబోయిన వీరబాబు, మద్దిని వెంకటేశ్వర్లు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను
# వేగంగా పూర్తి చేయండి..

- ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలి
- సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ కు ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి ఆదేశం

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి మంగళవారం పరిశీలించారు. స్టేషన్ లోపల కొత్తగా చేపట్టిన ఎస్కులేటర్ల నిర్మాణ పనుల పురోగతిని.. ఎస్ఎస్ఈ అఖిల్, సీసీఐ ఎండీ.జావిద్, ఇతర రైల్వే అధికారులు మోహన్ కుమార్, అనిల్ కుమార్ తదితరులను అడిగి తెలుసుకున్నారు.

**ఎండాకాలం కదా.. జాప్యం చేయకండి..**

గతంలో తాను తనిఖీ చేశానని, మార్చి కల్లా పూర్తి చేస్తామని అప్పుడు మాటిచ్చారని.. ఇంకా ఎందుకు పూర్తి కాలేదని ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ప్రశ్నించారు. దూర ప్రాంతాలకు వెళ్లే.. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చూసుకోవాలని, అసౌకర్యం కలగనివ్వొద్దని అన్నారు. ఎస్కులేటర్, ఇతర నిర్మాణ పనులను పరిశీలించారు. ఎండాకాలం కావడంతో.. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నాయని, స్టేషన్ లోపల నిర్మాణాలతో ప్రయాణికులు వేచి ఉండేందుకు అసౌకర్యం చెందుతుంటారని, జాప్యం లేకుండా.. వేగంగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు.


**మస్త్.. చాయ్..**

రైల్వే స్టేషన్ ఎదుట ఓ టీ స్టాల్ వద్దకు ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి వెళ్లి.. కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులతో కలిసి చాయ్ తాగారు. చాయ్ అచ్చీ హై.. మస్త్.. (టీ.. చాలా బాగుంది..) అంటూ కితాబునిచ్చారు.

ఈ కార్యక్రమాల్లో..: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పలువురు ప్రజా ప్రతినిధులు, ఐఎన్టీయూసీ నాయకులు, మున్సిపల్ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల
# లబ్ధిదారుల ఎంపిక..

- రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఏప్రిల్ 30 లోపు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రతి దశలో లబ్ధిదారులకు సహకారం అందించాలి
- ఎల్.ఆర్.ఎస్. క్రమబద్ధీకరణ ఫీజులో 25% రాయితీ గడువు పొడిగింపు ఉండదు
- ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ఎల్.ఆర్.ఎస్. పై కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి పొంగులేటి





**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

పేదల సొంతింటి కల నిజం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడత లబ్ధిదారుల ఎంపికను అధికారులు పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర సీఎస్ శాంతి కుమారి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌతమ్ లతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి ఇట్టి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పేదవాడు సొంత ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రజా ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలను ఉచితంగా సబ్సిడీ కింద అందిస్తుందని, దేశంలో మరే రాష్ట్రంలో ఇంత పెద్దన సాయం అందడం లేదని, మిగిలిన రాష్ట్రాల్లో లక్షన్నర నుంచి 3 లక్షల వరకు ప్రభుత్వాలు సహాయం చేస్తుంటే మన తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలను అందిస్తుందని తెలిపారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి విడత లో 3 వేల 500 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతి పర్యవేక్షించేందుకు నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని అన్నారు. మనకు వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు, జనాభా ఆధారంగా గ్రామాలకు, మున్సిపల్ వార్డులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పూర్తి చేయాలని అన్నారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఉన్న ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇందిరమ్మ ఇండ్లకు అర్హుల జాబితా ఎంపిక చేయాలని, ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్లకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి ఏప్రిల్ 30 లోపు మరో సారి ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి నాణ్యతతో పారదర్శకంగా జరగాలని, ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే మంజూరు చేసే జాబితా నుంచి తొలగించాలని అన్నారు.

ప్రతి మండలంలో ఎంపిక చేసిన పైలెట్ గ్రామంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లలో బేస్మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న వారికి మొదటి విడత కింద లక్ష రూపాయలను ఇటీవలే విడుదల చేశామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పెద్ద సంఖ్యలో గ్రౌండ్ అవుతున్న నేపథ్యంలో ఎక్కడ సామాగ్రి ధరలు అనుభవంగా పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాపారులు ఎక్కడ కృత్రిమ కొరత సృష్టించకుండా చూడాలని మంత్రి తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చూడాలని, బలహీన వర్గాల ఇంటి నిర్మాణానికి ఉచితంగా సరఫరా చేయాలని ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నందున, ప్రతి మండల కేంద్రంలో ఇసుక అందుబాటులో పెట్టాలని మంత్రి తెలిపారు. మండలంలో నిర్మించిన మోడల్ ఇండ్లు నమూనాలను లబ్ధిదారులకు చూపించాలని మంత్రి అధికారులకు సూచించారు. పేదలకు ఇంటి నిర్మాణంలో ప్రతి దశ లోను అధికారులు సహాయం అందించాలని మంత్రి అన్నారు.

వర్షాకాలం ప్రారంభం కంటే ముందే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని అన్నారు. 5 లక్షల రూపాయల వరకు సబ్సిడీ ఇస్తున్నందున అత్యంత నిరు పేదలకు మొదటి విడతలో ఎంపిక చేయాలని అన్నారు. సివిల్ ఇంజనీరింగ్ లో అత్యుత్తమ మార్కులు వచ్చిన యువకులను తాత్కాలిక ప్రాతిపదికన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఇంజనీర్లుగా నియమిస్తున్నామని, వీరికి అవసరమైన శిక్షణ అందించి త్వరలోనే మండలాలకు కేటాయిస్తామని మంత్రి తెలిపారు.

ప్రతి మండలంలో జరిగే ఇందిరమ్మ ఇండ్ల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియజేస్తూ సదరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల సహాయం త్వరగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలలో స్లం ఏరియాలో జి+3 మోడల్ లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించేందుకు వీలుగా లబ్ధిదారులు ముందుకు వస్తే రాబోయే విడతలలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.

భూ భారతి చట్టం మన రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద 4 మండలాలలో ముందస్తుగా అమలు చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాలలో ఈ చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి సూచించారు.

4 మండలాలలో రెవెన్యూ సదస్సులు పూర్తిచేసుకున్న తర్వాత అందులో నుంచి వచ్చిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి జిల్లాలో ఒక మండలం నుంచి తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్ వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రతి జిల్లాకు అవసరమైన సర్వే సామాగ్రి అందించడం జరుగుతుందని అన్నారు. భూ భారతి చట్టాన్ని క్షేత్రస్థాయిలో తూచ తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లు, జిల్లా స్థాయి ఉన్నతాధికారుల పై అధికంగా ఉంటుందని అన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రజలకు భారం కాకుండా 25% రాయితీని అందించామని, దీనినే ముఖ్యమంత్రి ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించామని అన్నారు. మరోసారి ఎల్.ఆర్.ఎస్ 25% రాయితీ గడువు పొడిగింపు మరొక్కసారి ఉండదని ఈ అంశాన్ని ప్రజలకు విస్తృతంగా తీసుకుని వెళ్లి, ఆమోదం పొందిన దరఖాస్తుల ఫీజులు వసూలు చేసి క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై ఇప్పటివరకు 6 మండలాల్లో అవగాహన సదస్సులు చేపట్టినట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఎంపికయిన నేలకొండపల్లి మండలంలో 32 గ్రామాలకు గాను ఇప్పటి వరకు 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు చేపట్టి, 1079 దరఖాస్తులు వివిధ భూ సమస్యలపై స్వీకరించినట్లు తెలిపారు. ఇందులో మేజర్ గా సాదా బైనామాల దరఖాస్తులు 508 ఉన్నట్లు కలెక్టర్ అన్నారు. జిల్లాలో 10 నుండి 15 శాతం మిస్ మ్యాచ్ సర్వే నెంబర్లు ఉన్నట్లు, సర్వే చేపడితే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

ఈ సమావేశంలో ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్, పిడి హౌజింగ్ బి. శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు పూర్తి స్థాయిలో దోహదపడే చట్టం
# భూ భారతి చట్టం

- భూ భారతి చట్టం... భూమి హక్కుల రికార్డు చట్టం
- అధికారులు సైతం నూతన చట్టంపై అవగాహన కలిగి ఉండాలి
- అవగాహన లేకుండా కొత్త సమస్యలు తీసుకురావద్దు: కడియం శ్రీహరి

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**

రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడానికే భూ భారతి 2025 ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకురావడం జరిగిందని మాజి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.

ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన భూ భారతి అవగహన సదస్సులో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టంలోని అంశాలను అధికారులు రైతులకు వివరించారు. రైతుల సందేహాలను రెవెన్యూ అధికారులు నివృత్తి చేశారు.

అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని, వాటి ద్వారా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని ఇప్పుడు అలాంటి సమస్యలు తాలేత్తకుండా భూ భారతి చట్టాన్ని తెచ్చినట్లు వెల్లడించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ధరణి కంటే మెరుగైన చట్టం భూ భారతి చట్టం అని అన్నారు. భూ భారతి ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించడానికి, భూ రికార్డులలో జరిగిన తప్పులను సవరించడానికి అవకాశం లభించిదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10లక్షల సాదా బైనామా దరఖాస్తులను పరిష్కారానికి భూ భారతి చట్టం ద్వారా మార్గం సుగమం అయిందని తెలిపారు. అలాగే పార్ట్ బీ 18లక్షల ఎకరాలకు సంబందించిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవకాశం లభిస్తుందని అన్నారు. రైతులతో పాటు అధికారులకు ఒరియేంటేషన్ క్లాసులు నిర్వహించాలని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి, రైతులకు మెరుగైన సేవలు అందించే విధంగా రెవెన్యూ సిబ్బంది పనితీరు ఉండాలని సూచించారు.

**అదనపు కలెక్టర్ మాట్లాడుతూ**

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ 1971లో వచ్చిన ఆర్ఓఆర్ చట్టం, 1989లో వచ్చిన వారు చట్టం లలో ఎక్కడైనా లోపాలు, తప్పులు ఉన్నట్లయితే సవరించుకోవడానికి వీలు ఉండేదన్నారు. ఈ రెండు చట్టాల ద్వారా భూ సమస్యలపై అభ్యంతరాలు చేసేందుకు ఆపిల్ వ్యవస్థ ఉండేదన్నారు. 20 లో వచ్చిన ధరణి తో జరిగిన పొరపాట్లను సరిదిద్దేందుకు ఎవరికి కూడా అవకాశం లేకుండా పోయిందన్నారు. భూ సమస్యలపై అభ్యంతరాలు తెలిపే అప్పిలు వ్యవస్థ లేక పోవడంతో రైతుల భూ సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతి చట్టం ఉపయోగపడుతుందన్నారు. ఈ చట్టం గురించి తెలుసుకోవాలని, సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ సదానందం, ఇతర అధికారులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ప్రజలు పాల్గొన్నారు.





## ఇంటర్ విద్యార్థులకు మంత్రి సీతక్క శుభాకాంక్షలు

**ములుగు,తెలంగాణ ముచ్చట్లు:** ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకి పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఇంటర్ సెకెండ్ ఇయర్ ఫలితాల్లో తన సొంత జిల్లా ములుగు మొదటి స్థానంలో, తాను ఇంచార్జీగా ఉన్న ఆసిఫాబాద్ జిల్లా రెండో స్థానంలో నిలవడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. వెనకబడిన జిల్లాలు, గిరిజన ప్రాంతాలుగా పేరున్న ఈ రెండు జిల్లాల విద్యార్దులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటడం తనకు ఎంతో సంతోషానిచ్చిందన్నారు. ఈ విజయానికి కారణమైన ఆయా జిల్లా కలెక్టర్లను, డీఈవోలను, ఇతర అధికారులకు మంత్రి సీతక్క అభినందనలు తెలిపారు. మొదటి స్థానంలో ములుగును నిలపడంలో కృషి చేసిన కలెక్టర్, ఐటీడీఏ అధికారులు, డీఈవోను మంత్రి సీతక్క ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్ కార్యాలయంలో వారిని శాలువాలతో మంత్రి సీతక్క సన్మానించారు. విద్యా ప్రమాణాలను పెంచడంలో తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలను ఈ సందర్భంగా మంత్రి సీతక్క గుర్తు చేశారు.

## జమ్ము కాశ్మీర్ ఉగ్రదాడిపై మాజీ డిప్యూటీ సిఎం
# తాటికొండ రాజయ్య తీవ్ర దిగ్భ్రాంతి

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:** జమ్ము కాశ్మీర్‌లోని పహేల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో పలువురు అమాయకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండిస్తూ, పర్యటన కోసం వచ్చిన నిరాయుధ పౌరులపై ఉగ్రవాదులు తుపాకులు ఎక్కించడం అమానుష చర్యగా అభివర్ణించారు. ఇలాంటి అమానవీయ చర్యలు దేశ సమగ్రతపై దాడులకు సమానమని ఆవేదన వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గాయపడ్డవారికి



అత్యుత్తమ వైద్యసేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను డాక్టర్ రాజయ్య కోరారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో అణిచివేయాల్సిన అవసరం ఉందని, ఇటువంటి దారుణ ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ చేశారు.

# భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలి

- ఎస్డీసి, పాలేరు నియోజకవర్గ నోడల్ అధికారిణి రాజేశ్వరి
- భూ భారతి చట్టంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం
- నేలకొండపల్లి మండలం చెన్నారం, అజయ్ తాండ, బైరవునిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను తనిఖీ చేసిన నోడల్ అధికారిణి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని ఎస్డీసి, పాలేరు నియోజకవర్గ నోడల్ అధికారిణి ఎం. రాజేశ్వరి తెలిపారు. సోమవారం నేలకొండపల్లి మండలం చెన్నారం, అజయ్ తాండ, బైరవునిపల్లి గ్రామాలలో చేపట్టిన రెవెన్యూ సదస్సులను నియోజకవర్గ నోడల్ అధికారిణి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, నిర్వహిస్తున్న రిజిస్టర్లు, దరఖాస్తుదారులకు ఇస్తున్న రశీదు, ఏ ఏ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నది పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకుంటున్న రైతులతో సమస్యలు అడిగి తెలుసుకుని, భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నోడల్ అధికారిణి మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు.



భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని ఇంచార్జ్ కలెక్టర్ తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు

హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని నోడల్ అధికారిణి అన్నారు.

చెన్నారం గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 54, అజయ్ తాండ గ్రామానికి సంబంధించి 4, బైరవునిపల్లి గ్రామానికి సంబంధించి 82 దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ తఫజ్జుల్ హుస్సేన్, నాయబ్ తహసీల్దార్ ఇమ్రాన్, ఆర్ఐ లు శ్రీనివాస్, రవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# అమెరికాలో జననాల రేటు క్షీణతపై ఆందోళన

## బేబీ బోనస్‌తో కుటుంబాలను ప్రోత్సహించేందుకు ట్రంప్ యంత్రాంగం యోచన



దేశంలో జననాల రేటు తగ్గుదలపై అమెరికా ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎక్కువ మంది పిల్లలను కనేలా ప్రోత్సహించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా జన్మనిచ్చిన మహిళకు 5వేల డాలర్ల 'బేబీ బోనస్' వంటి అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నట్లు అమెరికన్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

క్షీణిస్తున్న జననాల రేటును అధిగమించేందుకు అవసరమైన ప్రణాళికలకు సంబంధించి వైట్హౌస్లో ఇటీవల అంతర్గతంగా ఓ కీలక సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. సంతాన సాఫల్యంపై మహిళలకు అవగాహన, బిడ్డల్ని కనే కుటుంబాలకు ప్రోత్సాహకాలు చర్చకు వచ్చాయి. ఇందులో భాగంగా బిడ్డకు జన్మనిచ్చే ప్రతి అమెరికన్ మాతృమూర్తికి 'బేబీ బోనస్' కింద 5వేల డాలర్లు, పన్ను మినహాయింపుల వంటి అంశాలు ప్రతిపాదించినట్లు తెలిసింది. వివాహం చేసుకున్న లేదా పిల్లలున్న వారికి ప్రతిష్ఠాత్మక స్కాలర్షిప్లలో 30శాతం స్లాట్లు కేటాయించాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ.. వీటిపై కొంత వివాదం నడుస్తున్నట్లు సమాచారం.

# మాజీ డీజీపీ హత్య కేసులో పల్లవి అంగీకారం



కర్ణాటక మాజీ డీజీపీ ఓం ప్రకాశ్ (68) దారుణ హత్య కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఘటనలో ప్రధాన నిందితురాలిగా ఉన్న మృతుడి భార్య పల్లవి కదలికలపై పోలీసులు ఆరాతీశారు. ఈక్రమంలో గుర్తించిన కొన్ని కీలక విషయాలను సంబంధిత వర్గాలు.

ఈ ఘటనకు ముందు ఐదు రోజులు గూగుల్లో హత్య గురించిన వివరాలను పల్లవి శోధించారు. ఎక్కడ నరాలు తెగితే మనిషి త్వరగా చనిపోతాడో ఆమె తెలుసుకున్నారని పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఓం ప్రకాశ్ను ఆయన భార్య పల్లవి, కుమార్తె కృతి పథకం ప్రకారం కడతేర్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. తానే హత్య చేసినట్లు పల్లవి పోలీసుల విచారణలో అంగీకరించారు. దీంతో ఆమెను అరెస్టు చేశారు. హత్యలో కృతి పాత్రపై లోతుగా విచారిస్తున్నారు. ప్రస్తుతం ఆమె మానసిక స్థితిని కూడా వైద్యులు పరిశీలిస్తున్నారు. ఈ దారుణ ఘటనపై ఓం ప్రకాశ్ కుమారుడు కార్తీక్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

ప్రస్తుతం పల్లవిని కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించింది. ఇక దర్యాప్తులో భాగంగా పోలీసులు సోమవారం సాయంత్రం ఆమెను ఘటనాస్థలానికి తీసుకెళ్లి ప్రశ్నించారు. హత్యకు ముందు నిందితురాలు వాట్సప్ గ్రూప్లో పలు సందేశాలు ఉంచారని తెలుస్తోంది. సొంత ఇంట్లోనే తనను బంధించారని, నిరంతర నిఘాలో ఉన్నానని ఆమె పేర్కొన్నట్లు తెలుస్తోంది. తన కుమార్తె భద్రతపై ఆందోళన వ్యక్తంచేసినట్లు సమాచారం.

ఈ హత్యకు ఓం ప్రకాశ్ భార్య మానసిక స్థితి ఎంత కారణమో.. ఆస్తి గొడవలూ అంతే కారణమని భావిస్తున్నారు. ఓం ప్రకాశ్ భార్య, కుమార్తె వద్ద కంటే కుమారుడు, చెల్లితో ఉండేందుకే ఇష్టపడేవారు. ఉత్తరకన్నడ జిల్లా దండేలి వద్ద ఉన్న 17 ఎకరాల భూమిని కుమారుడు, చెల్లికి రాసేందుకు సిద్ధమయ్యారు. దీంతో భార్య, కుమార్తెలు ఓం ప్రకాశ్తో నిత్యం గొడవ పడుతూ చివరకు ప్రాణాలు తీసే స్థితికి చేరారని అనుమానిస్తున్నారు.

# ఏఐ ఆధారిత ఉద్యోగాలకు గిరాకీ



దేశీయ ఉద్యోగ విపణిలో కృత్రిమ మేధ (ఏఐ)కు ప్రాధాన్యం పెరుగుతోందని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ నివేదిక వెల్లడించింది. ఏఐ సంబంధిత ఉద్యోగాలకు తాజా ఉత్తీర్ణుల (ఫ్రెషర్స్)ను ఎంపిక చేసుకునేందుకు ఉద్యోగ సంస్థలు ముందుకొస్తున్నాయని పేర్కొంది. 2025 జనవరిజూన్‌లో 74 శాతానికి పైగా కంపెనీలు ఫ్రెషర్స్‌ను నియమించుకునేందుకు సిద్ధంగా ఉన్నాయని 'కెరీర్ అవుట్‌లుక్' నివేదికలో టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ తెలిపింది. దేశ వ్యాప్తంగా 649 యజమాన్య సంస్థలను సర్వే చేసి ఈ నివేదికను రూపొందించినట్లు వివరించింది.

**పట్టా కాదు.. నైపుణ్యమే కీలకం**

కంపెనీల నిర్వాహకులు డిగ్రీ పట్టాల ఆధారంగా నియామకాలు చేయదలచుకోవడం లేదు. డేటా విజువలైజేషన్, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ వంటి రంగాల్లో నైపుణ్యాలున్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నారు. 'ఫ్రెషర్లు అధిక ప్రభావవంత ఉద్యోగాల్లోకి అడుగుపెట్టడానికి, పరిశ్రమల్లో ఆవిష్కరణలకు కీలక చోదకులుగా మారడానికి ఈ మార్పు అద్భుతంగా ఉపయోగపడుతుంద'ని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ హెడ్ ఆఫ్ ఎంప్లాయిబిలిటీ బిజినెస్ అండ్ సీఓఓ జైదీప్ కేవాల్‌రమణి వెల్లడించారు. ఇకామర్స్, టెక్నాలజీ అంకురాల నిర్వాహకుల్లో 70% మంది కూడా తాజా ఉత్తీర్ణులను నియమించుకోవాలని యోచిస్తున్నారు. తయారీ రంగంలో 66%, ఇంజినీరింగ్‌మౌలిక సదుపాయాల రంగంలో 62% మంది నిర్వాహకులూ ఫ్రెషర్స్‌ను నియమించుకోవాలని చూస్తున్నారని నివేదిక వెల్లడించింది.

బెంగళూరు, ముంబయి, చెన్నై వంటి నగరాలు కీలక ఉపాధి కేంద్రాలుగా ఉన్నాయి. ఈ నగరాల్లో నియామక అవకాశాలు వరుసగా 78%, 65%, 57 శాతంగా ఉన్నాయి.

రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, పర్ఫార్మెన్స్ మార్కెటింగ్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, ఫైనాన్షియల్ రిస్క్ అనాలిసిస్‌ను అర్థం చేసుకునే ప్రతిభను కంపెనీలు కోరుకుంటున్నాయి.

అవసరమైన టెక్నాలజీ టూల్స్‌లో ప్రొడక్టివిటీ అండ్ కొలాబరేషన్ టూల్స్ (83%), ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ (73%), డేటా విజువలైజేషన్ టూల్స్ (64%)కు యజమానులు ప్రాధాన్యం ఇస్తున్నారు.



# పోప్ ఫ్రాన్సిస్‌కు వినయపూర్వక వీడ్కోలు

## శనివారం సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో అంత్యక్రియలు

వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బాసిలికా చర్చిలో మూడు రోజులపాటు ప్రజల సందర్శనలు, నివాళుల తర్వాత శనివారం పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలను నిర్వహించనున్నారు. కోట్లాది మంది క్యాథలిక్‌ల అత్యున్నత మతాధికారి అయినప్పటికీ అత్యంత సాధారణ వ్యక్తిలా ఖనన క్రతువును పూర్తిచేయాలని పోప్ కోరుకున్నారని, అదేరీతిలో అంత్యక్రియలను పూర్తిచేస్తామని వాటికన్ వర్గాలు ప్రకటించాయి. పోప్ మరణంతో ప్రపంచవ్యాప్తంగా సంతాపాలు వెల్లువెత్తుతున్న వేళ పోప్ అంత్యక్రియల షెడ్యూల్ వివరాలను వాటికన్ అధికార వర్గాలు మంగళవారం వెల్లడించాయి. సెయింట్ పీటర్స్ స్క్వేర్ వద్ద శనివారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియల కార్యక్రమాన్ని మొదల పెట్టనున్నారు. కార్డినల్ల కాలేజీ డీన్ అయిన 91 ఏళ్ల కార్డినల్ జియోవన్నీ బటిస్టా రే నేతృత్వంలో ఈ కార్య క్రమాన్ని నిర్వహించనున్నారు. 88 ఏళ్ల పోప్ ఫ్రాన్సిస్ సోమవారం బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా కోమాలోకి వెళ్లి, తర్వాత గుండె వైఫల్యం కారణంగా కన్ను మూసారు.

# దిల్లీ హైకోర్టు ఆగ్రహం

## హమ్దర్ద్ పై వ్యాఖ్యలపై రాందేవ్ బాబాకు తీవ్ర హెచ్చరిక

యోగా గురువు రామ్దేవ్ బాబాపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. హమ్దార్ద్ పానీయం విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయం కావని పేర్కొంది.

కొన్ని రోజుల క్రితం హమ్దర్ద్ షర్బత్ గురించి రామేవ్ బాబా పరోక్షంగా తీవ్ర ఆరోపణలు చేశారు. దానిని కొనుగోలు చేయడం వల్ల వచ్చే లాభాలను కంపెనీ వేరొక వర్గానికి చెందిన నిర్మాణాలు చేపట్టేందుకు ఉపయోగిస్తోందన్నారు. "అదే ఈ షర్బత్ (పతంజలి సంస్థకు చెందిన పానీయం) తాగితే.. గురుకులాలను నిర్మించవచ్చు. పతంజలి విశ్వవిద్యాలయాన్ని విస్తరించవచ్చు" అంటూ రామ్‌దేవ్ మాట్లాడారు. దానికి సంబంధించిన వీడియో వివాదాస్పదమైంది. ఈ క్రమంలో హర్ద్ కంపెనీ దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. వెంటనే ఆ వీడియోను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది.

హమ్ర్ద్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గా వాదనలు వినిపించారు. ఇది ఆ సంస్థ ఉత్పత్తిని అగౌరవపరచడం కంటే తీవ్రమైందని, అవి ద్వేషపూరిత వ్యాఖ్యల కిందికే వస్తాయని వాదించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. "ఈ వ్యాఖ్యలు కోర్టు అంతరాత్మను షాక్కు గురిచేశాయి. ఇలాంటి వ్యాఖ్యలు ఎంతమాత్రం సమర్థనీయం కాదు" అని తీవ్రంగా స్పందించింది.

గతంలో తప్పుదోవ పట్టించే ప్రకటనల వ్యవహారంలో పతంజలి ఆయుర్వేద్ సంస్థ వ్యవస్థాపకులు రాందేవ్ బాబా ఎండీ ఆచార్య బాలకృష్ణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పిన సంగతి తెలిసిందే. ఆ ప్రకటనల కేసుపై సుప్రీం కోర్టులో విచారణ కూడా జరిగింది. ఇకపై అలాంటి యాడ్స్ ఇవ్వబోమని వారు కోర్టుకు విన్నవించారు. ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం వారిపై ధిక్కరణ కేసును మూసివేసింది. అయితే, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది.




# లక్ష దాటిన గోల్డ్ ఫ్యూచర్స్



లోహాల ఫ్యూచర్స్ ట్రేడింగ్ జరిగే మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లోనూ 10 గ్రాముల బంగారం ధర తొలిసారిగా రూ. లక్షను తాకింది. 2025 ఆగస్టు కాంట్రాక్టు ధర గరిష్ఠంగా రూ.1,00,000కు చేరినా, మంగళవారం రాత్రి 11.30 గంటల సమయానికి రూ.98,069 వద్ద ట్రేడ్ అవుతోంది. జూన్ కాంట్రాక్టు రూ.98,753 వద్ద ప్రారంభమైనా, కాస్త తగ్గి రూ.97,415 వద్ద ట్రేడింగ్ జరుగుతోంది.

ఎంసీఎక్స్లో బంగారం ట్రేడింగ్ 2003 నవంబరులో ప్రారంభమైంది. అప్పుడు 10 గ్రాముల ధర రూ.5,858 కాగా, ఇప్పుడు రూ. లక్షను తాకింది. అంటే 21 ఏళ్లలో బంగారం ధర 17 రెట్లు పెరిగింది.

10 గ్రాముల పసిడి 2008 5.10,0005, 20115 5.20,0005, 20205 5. 40,0005, 2022 2 5. 51,9995, 20235 5.60,2995 . 2024 25 5.70,511 వద్ద ఉంది. అంటే పసిడిపై పెట్టుబడి పెట్టిన వారికి ఏడాది వ్యవధిలో 41% ప్రతిఫలం లభించింది.

# అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటన

**వాణిజ్య ఒప్పందాలపై కీలక చర్చలు, భారత్–అమెరికా సంబంధాల్లో కొత్త మలుపు!**



అమెరికా విధించబోయే సుంకాల గురించి మనతో సహా ప్రపంచమంతా బెంబేలు పడుతున్న వేళ, అక్కడ చదివే మన విద్యార్థులు, వృత్తిగత నిపుణులు వీసా సమస్యలతో సతమతమవుతున్న వేళ నాలుగు రోజుల వ్యక్తిగత పర్యటన కోసం ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటుంబ సమేతంగా సోమవారం మన గడ్డపై అడుగుపెట్టారు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఎంతో ఇష్టుడైన నేత కనుక ఆయన ద్వారా కొన్ని సమస్యలైనా పరిష్కారమవుతాయన్న విశ్వాసం మన దేశానికున్నట్టుంది.

అందుకే కావొచ్చు... ప్రోటోకాల్స్ పక్కనబెట్టి మరీ ఆయనకు ఘనస్వాగతమిచ్చారు. మారిన పరిస్థితుల రీత్యా అమెరికాతో కొత్తగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం మన దేశానికి తప్పనిసరి. ఇప్పటికే ఆ విషయంలో ఇరు దేశాల మధ్యా సంప్రదింపులు సాగుతున్నాయి. ఒప్పందాలకు సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాలు ఖరారయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన తర్వాత వాన్స్ ప్రకటించారు.

దాదాపు 60 దేశాలపై సుంకాలను భారీ యెత్తున పెంచుతూ ఈ నెల 2 నుంచి అమల్లోకొస్తాయని ప్రకటించిన ట్రంప్, ఆ తర్వాత 90 రోజుల పాటు నిలిపివేశారు. కేవలం చైనాపై మాత్రమే అవి కొనసాగుతున్నాయి. పాత ఒప్పందాల స్థానంలో కొత్తవి కుదుర్చుకోవటం, తమకు మరింత మేలు కలిగేలా చేసుకోవటం ట్రంప్ ధ్యేయం. అందుకోసమే మూడు నెలల కొత్త గడువు విధించారు.

నాలుగేళ్ల క్రితం రిపబ్లికన్ పార్టీకీ, ప్రత్యేకించి ట్రంప్‌కూ తీవ్ర వ్యతిరేకి అయిన జేడీ వాన్స్ ట్రంప్ తొలి దశ పాలనలోనే ఆయనకు మద్దతుదారుగా మారారు. గడచిన వంద రోజులుగా ఉపాధ్యక్షుడిగా ఆయన వ్యవహార శైలి గమనిస్తే రిపబ్లికన్ పార్టీలో ఆయన మున్ముందు కీలకపాత్ర పోషించే అవకాశాలున్నాయని సులభంగానే చెప్పొచ్చు. ఆ మితవాద పక్షానికి ఆయన సరికొత్త స్వరంగా మారారు. ట్రంప్‌ను ఏయే అంశాల్లో ఇంతవరకూ వాన్స్ ఒప్పించారన్నది ఎవరికీ తెలియదుగానీ... ఆయన విజన్‌ను తు.చ. తప్పకుండా పాటిస్తున్న నేతగా ఇప్పటికే నిరూపించు కున్నారు. మ్యూనిక్ భద్రతా సదస్సు సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మారిన అమెరికా వైఖరిని నిక్కచ్చిగా చెప్పటంలో వాన్స్ విజయం సాధించారు. యూరప్ దేశాలు నొచ్చుకున్నా ఆయన ఖాతరు చేయలేదు. బ్రిటన్ విధానాలను దుయ్యబట్టారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని మందలిస్తున్న ట్రంప్‌తో గొంతు కలిపారు. గ్రీన్‌ల్యాండ్‌ను కొనితీరాలన్న ట్రంప్ అభిమతానికి అనుగుణంగా చెప్పాపెట్టకుండా కుటుంబ సమేతంగా వాన్స్ అక్కడికెళ్లారు. ప్రస్తుతం రక్షణ, విదేశీ వ్యవహారాలు డెన్మార్క్‌కు అప్పగించటం మినహా ఇతరత్రా స్వయం ప్రతిపత్తిని అనుభవిస్తున్న గ్రీన్‌ల్యాండ్‌కుగానీ, డెన్మార్క్‌కుగానీ ఈ ప్రతిపాదన ఇష్టం లేదు. ట్రంప్ మాదిరే స్వేచ్ఛా వాణిజ్యాన్ని, ఉదారవాద ఆర్థికవిధానాలనూ, భారీ వలసలనూ వాన్స్ తీవ్రంగా వ్యతిరేకిస్తారు. వాన్స్ అంటే వల్లమాలిన అభిమానం ఏర్పడటానికి ట్రంప్‌కు చాలా కారణాలున్నాయి. వాన్స్‌లోని రచనా శక్తి అందులో ఒకటి. ఒకప్పుడు తనను 'అమెరికన్ హిట్లర్' అన్నా దాన్నంతటినీ మరిచి పోయే స్థాయిలో వాన్స్ ఆత్మకథాత్మక నవల 'హిల్‌బిల్లీ ఎలిజీ' ట్రంప్‌ను కట్టిపడేసింది. 2022లో ఆయనను ఒహాయో సెనెటర్‌ను చేయటమేగాక, అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ ఉపాధ్యక్ష అభ్యర్థిగా నిర్ణయించటానికి కూడా ఆ నవల ఉపకరించింది.

శ్వేతజాతి అమెరికన్ జనాన్ని కూడగట్టడంలో, డెమాక్రాట్ల ఏలుబడిలో జరిగిన అన్యాయాలను ఏకరువు పెట్టడంలో ట్రంప్‌కు వాన్స్ నవల తోడ్పడిందని చెప్పాలి. పర్వత ప్రాంతాలను ఆనుకుని వుండే మారుమూల ప్రాంతాల్లో అక్షరాస్యతకూ, అభివృద్ధికీ దూరంగా వుండే శ్వేతజాతి అట్టడుగు వర్గాల జీవితాన్ని ఆ నవలలో వాన్స్ చిత్రీకరించారు. అరకొర పనులతో, అర్ధాకలి బతుకులతో వెళ్లబుచ్చే జనాలను నేరుగా చూసిన ఆ ప్రాంతవాసిగా వాన్స్ దాన్ని ప్రభావవంతంగా చెప్పగలిగారు.

ఆ అట్టడుగు జనం గురించి ట్రంప్ ఎంత మాట్లాడినా నవలలో వాన్స్ చిత్రించిన జీవితానుభవం ట్రంప్‌కు లేదు. అది తెలుసుకున్నాక ఆయన మరింతగా ఆ వర్గంలోకి చొచ్చుకుపోగలిగారు. అందుకే కావొచ్చు... ట్రంప్‌కు వాన్స్ అంటే ప్రత్యేకాభిమానం ఏర్పడింది. అలాగని ఆయనను తన వారసుడిగా ప్రకటించదల్చుకోలేదు. మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయటాన్ని రాజ్యాంగం నిరాకరిస్తున్నా, దాన్ని ఎలాగోలా మార్చి మరోసారి ఆ పీఠాన్ని అధిష్ఠించాలని ట్రంప్ కలలుగంటున్నారు. అదెంతవరకూ కుదురుతుందో భవిష్యత్తే తేల్చాలి. అసాధ్యమైతే మాత్రం ట్రంప్ మొదటి ఎంపిక వాన్సే కావొచ్చు.గత ఆర్థిక సంవత్సరంలో ఇరు దేశాల వాణిజ్యం విలువ 12,920 కోట్ల డాలర్లు. మన నుంచి అమెరికా నిరుడు 8,740 కోట్ల డాలర్ల సరుకును దిగుమతి చేసుకుంది. మూడు నెలల తర్వాత మనపై 26 శాతం సుంకాలు విధిస్తే అక్కడి మార్కెట్‌లో మన సరుకుల ధర పెరిగి డిమాండ్ పడి పోవచ్చు.

అందుకే ద్వైపాక్షిక చర్చలు అత్యవసరమయ్యాయి. తమను నష్టపరిచే విధంగా అమెరికాతో ఎవరైనా ఒప్పందం చేసుకుంటే ప్రతిచర్యలు తీసుకోవాల్సి వస్తుందని చైనా హెచ్చరించగా... ఆ దేశంతో పరిమిత వాణిజ్యమే నెరపాలని ప్రపంచ దేశాలకు ట్రంప్ చెబుతున్నారు. ఇది ముదిరితే పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారొచ్చు. వర్తమాన అంతర్జాతీయ పరిస్థితుల్లో దౌత్యం తాడు మీది నడక లాంటిది. దాన్ని విజయవంతంగా పరిపూర్తి చేయటం అంత సులభమేం కాదు.గట్టిగా మాట్లాడి, అనుకున్నది సాధించటంలో మోదీకి మరెవరూ సాటిరారని వాన్స్ కితాబిచ్చారు. కుదరబోయే ఒప్పందాలు దాన్ని నిరూపిస్తే అంతకన్నా కావాల్సిందేముంది?

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




# లఖ్‌నవూపై ఢిల్లీ విజయం

తొలి ఐపీఎల్ టైటిల్ వేటలో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ మరో కీలక విజయాన్ని అందుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఢిల్లీ 8 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. మార్‌క్రమ్ (33 బంతుల్లో 52; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... మిచెల్ మార్ష్(36 బంతుల్లో 45; 3 ఫోర్లు, 1 సిక్స్), ఆయుష్ బదోని (21 బంతుల్లో 36; 6 ఫోర్లు) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ముకేశ్ కుమార్ (4/33) లక్నోను పడగొట్టాడు. అనంతరం ఢిల్లీ 17.5 ఓవర్లలో 2 వికెట్లకు 161 పరుగులు చేసి గెలిచింది. కేఎల్ రాహుల్ (42 బంతుల్లో 57 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), అభిషేక్ పొరేల్ (36 బంతుల్లో 51; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించగా... కెప్టెన్ అక్షర్ పటేల్ (20 బంతుల్లో 34 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు.



**ఓపెనర్ల శుభారంభం...**

తొలి వికెట్‌కు 59 బంతుల్లో 87 పరుగులు భాగస్వామ్యం... ఈ సమయంలో లక్నో స్థితి చూస్తే భారీ స్కోరు ఖాయమనిపించింది. అయితే ఓపెనర్లు మార్‌క్రమ్, మార్ష్ఇచ్చిన ఈ ఘనారంభాన్ని ఆ తర్వాత జట్టు వృథా చేసుకుంది. పవర్‌ప్లేలో కొన్ని చక్కటి షాట్లు ఆడిన ఓపెనర్లు 6 ఓవర్లు ముగిసేసరికి 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో స్కోరును 51 పరుగులకు చేర్చారు. ఆ తర్వాత చమీరా ఈ భాగస్వామ్యాన్ని విడదీయగా, స్టార్క్ చక్కటి బంతితో పూరన్ (9)ను బౌల్డ్ చేశాడు.

అనంతరం ముకేశ్ ఒకే ఓవర్లో సమద్ (2), మార్ష్ లను అవుట్ చేయడంతో లక్నో కష్టాలు పెరిగాయి. 11 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయాక పరుగులు రావడం కూడా కష్టంగా మారిపోయింది. అయితే 'ఇంపాక్ట్ ప్లేయర్'గా వచ్చిన బదోని కాస్త ప్రభావం చూపించాడు. ముకేశ్ వేసిన ఆఖరి ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు కొట్టిన అతను తర్వాతి బంతికి బౌల్డయ్యాడు. వరుసగా వికెట్లు పడుతున్నా... సమద్, మిల్లర్ (14 నాటౌట్), బదోని తర్వాత ఇన్నింగ్స్‌లో మరో రెండు బంతులు ఉండగా ఏడో స్థానంలో రిషభ్ పంత్ (0) బ్యాటింగ్‌కు రావడం ఆశ్చర్యం కలిగించింది. టాస్ సమయంలో కుడి చేతికి కట్టుతో కనిపించిన పంత్ సమస్యేమీ లేదని చెప్పాడు. 33 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న తర్వాత పొరేల్ వెనుదిరిగాడు. పొరేల్, రాహుల్ రెండో వికెట్‌కు 49 బంతుల్లో 69 పరుగులు జత చేశారు. అయితే ఆ తర్వాత రాహుల్, అక్షర్ కలిసి సునాయాసంగా జట్టును గెలుపు దిశగా నడిపించారు. రాహుల్, అక్షర్ మూడో వికెట్‌కు 36 బంతుల్లో అభేద్యంగా 56 పరుగులు జోడించారు.

**స్కోరు వివరాలు**

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) స్టబ్స్ (బి) చమీరా 52; మార్ష్(బి) ముకేశ్ 45; పూరన్ (బి) స్టార్క్ 9; సమద్ (సి) అండ్ (బి) ముకేశ్ 2; మిల్లర్ (నాటౌట్) 14; బదోని (బి) ముకేశ్ 36; పంత్ (బి) ముకేశ్ 0; ఎక్స్‌ట్రాలు 1; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 159. వికెట్ల పతనం: 1-87, 2-99, 3-107, 4-110, 5-159, 6-159. బౌలింగ్: అక్షర్ 4-0-29-0, స్టార్క్ 4-0-25-1, ముకేశ్ 4-0-33-4, చమీరా 3-0-25-1, విప్‌రాజ్ 1-0-14-0, కుల్దీప్ 4-0-33-0.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పొరేల్ (సి) మిల్లర్ (బి) మార్‌క్రమ్ 51; కరుణ్ నాయర్ (బి) మార్‌క్రమ్ 15; రాహుల్ (నాటౌట్) 57; అక్షర్ (నాటౌట్) 34; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (17.5 ఓవర్లలో 2 వికెట్లకు) 161. వికెట్ల పతనం: 1-36, 2-105. బౌలింగ్: శార్దుల్ ఠాకూర్ 2-0-28-0, దిగ్వేశ్ రాఠీ 4-0-24-0, ప్రిన్స్ 2.5-0-23-0, మార్‌క్రమ్ 3-0-30-2, అవేశ్ ఖాన్ 3-0-19-0, రవి బిష్ణోయ్ 3-0-36-0.



# బుమ్రాకు అరుదైన గౌరవం

టీమ్ ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు అరుదైన గౌరవం దక్కింది. 2024 ఏడాదికిగానూ విస్డెన్ పురుషుల లీడింగ్ క్రికెటర్ ఇన్ ది వరల్డ్ అవార్డుకు ఎంపికయ్యాడు. విస్డెన్ క్రికెటర్స్ అల్మనాక్ 2024 ఎడిషన్‌ను మంగళవారం రిలీజ్ చేసింది. గతేడాది బుమ్రా మూడు ఫార్మాట్లలోనూ అద్భుతంగా రాణించాడు. 21 మ్యాచ్‌ల్లో మొత్తం 86 వికెట్లు తీశాడు. 2024లో బుమ్రానే లీడింగ్ వికెట్ టేకర్ కావడం విశేషం. టెస్టుల్లో 20 కంటే తక్కువ అవరేజ్‌తో 200 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. గతేడాది టీమిండియా టీ20 వరల్డ్ కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గతేడాది ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను గెలుచుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే బుమ్రా విస్డెన్ క్రికెటర్స్ అవార్డుకు ఎంపికయ్యాడు. దీంతో బుమ్రా భారత దిగ్గజాల సరసన నిలిచాడు. విస్డెన్ క్రికెటర్స్ అవార్డు గెలిచిన నాలుగో భారత క్రికెటర్ బుమ్రా. అతని కంటే ముందు విరాట్ కోహ్లీ(2016, 2017, 2018), వీరేంద్ర సెహ్వాగ్(2008, 2009), సచిన్ టెండూల్కర్(2010) మాత్రమే ఈ అవార్డును గెలుచుకున్నారు.

# శివమ్ దూబేది గొప్ప మనసు

టీమ్ ఇండియా, చెన్నయ్ సూపర్ కింగ్స్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే గొప్ప మనసు చాటుకున్నాడు. యువ అథ్లెట్లను ప్రోత్సహించడానికి ముందుకొచ్చాడు. తమిళనాడుకు చెందిన 10 మంది యువ అథ్లెట్లకు ఒక్కొక్కరికి రూ. 70 వేలు అందజేస్తానని ప్రకటించాడు. మంగళవారం చెన్నయ్‌లో తమిళనాడు స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్(టీఎన్ఎస్‌జేఏ) వార్షిక అవార్డులు, స్కాలర్‌షిప్ కార్యక్రమం జరిగింది. పీబీ అభినంద్(టేబుల్ టెన్నిస్), కెఎస్ వెనిసా శ్రీ(ఆర్చరీ), ముత్తుమీనా వెల్లసామి(పారా అథ్లెటిక్స్), షామీనా రియాజ్(స్క్వాష్), జయంత్(క్రికెట్), ఎస్.నందన(క్రికెట్), పి.కమలి(సర్ఫింగ్), ఆర్. అభినయ(అథ్లెటిక్స్), జితిన్ అర్జున్(అథ్లెటిక్స్), తక్షంత్(చెస్) అవార్డులు గెలుచుకున్నారు. వీరికి టీఎన్ఎస్‌జేఏ రూ.30 వేలు అందజేసింది. ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్‌గా హాజరైన దూబే ఆ 10 మంది యువ అథ్లెట్లకు అదనంగా తనవంతు ఆర్థిక సాయం ప్రకటించాడు. ఒక్కొక్కరికి రూ.70 ఇస్తానని తెలిపాడు. ఈ సందర్భంగా దూబే మాట్లాడుతూ..'ఈ కార్యక్రమం యువ అథ్లెట్లను ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఈ చిన్న విజయాలే మరింత కష్టపడానికి, దేశాన్ని గర్వపడేలా చేయడానికి ప్రేరణగా నిలుస్తాయి. ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలి. రూ.30 వేలు చిన్న అమౌంట్‌గా ఉండొచ్చు. కానీ, ప్రోత్సాహకరంగా ఉంటుంది.' అని దూబే చెప్పుకొచ్చాడు.




# నేను నిన్ను చాలా ప్రేమిస్తున్నాను

హీరోయిన్ శృతి హాసన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అక్కర్లేదు. ఈ బ్యూటీ పవర్‌స్టార్ పవన్ కల్యాన్, ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ వంటి అగ్ర హీరోల సరసన నటించి మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. శృతి హాసన్ నటించిన సినిమాలు చాలా వరకు బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నవేనని చెప్పకోవచ్చు. అనగనగా ఓ ధీరుడు మూవీతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈ హీరోయిన్ వరుస అవకాశాలు అందుకుని.. వరుస హిట్లు కొట్టింది. ప్రేక్షకుల్లో మంచి ఫేమ్ సంపాదించుకుంది. అప్పట్లో శృతి హాసన్ ఓ మూవీ చేస్తుందంటే పక్కా హిట్ కొడుతుందనే భావన ప్రేక్షకుల్లో ఉండేది. తమ సినిమాలో పెట్టుకునేందుకు దర్శక, నిర్మాతలు కూడా ముందుకొచ్చేవారు. తన ప్రతిభతో ఈ హీరోయిన్ కోట్ల మంది ఫ్యాన్స్‌ను కూడా సొంతం చేసుకుంది. ప్రస్తుతం శృతి హాసన్‌కు అవకాశాలు తగ్గుముఖం పట్టాయని చెప్పకోవచ్చు.

ప్రస్తుతం ఈ నటి తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి కూలి చిత్రంలో నటిస్తోంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఆగస్టు 14 వ తారీకున ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇకపోతే ఈ ముద్దుగుమ్మ తాజాగా సోషల్ మీడియాలో తన నాన్న కమల్ హాసన్ గురించి ఓ పోస్ట్ పెట్టింది. " ఎల్లప్పుడూ నాకు వెలుగు, బలం.. నిరంతరం నా నవ్వుకు కారణం మీరే. నిన్ను చాలా ప్రేమిస్తున్నాను అప్పా" అంటూ రాసుకొచ్చింది. ప్రస్తుతం శృతి హాసన్ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.





# 'రివ్యూలు ఆపేయాలి.. బ్యాన్ చేయాలి అనలేను..

ఒకప్పుడు సినిమా భవిష్యత్ అభిమానుల చేతిలో ఉంటే.. ఇప్పుడు రివ్యూలు ఇచ్చే వారి చేతిలో ఉందనే చెప్పాలి. నిఖార్సైన సినిమా ప్రేమికులు వినహాయించి.. మెజార్టీ పీపుల్ రివ్యూలు చూసే సినిమాలకు వెళ్తుంటారు. ఈ రివ్యూల కారణంగా మంచి సినిమాలపై నెగిటివ్ ప్రచారం జరిగి అభిమానులు థియేటర్స్‌కు రావడం మానేస్తున్నారని నిర్మాతలు అనేకసార్లు బహిగంగంగానే చెప్పారు. తాజాగా రివ్యూలపై ప్రముఖ తెలుగు హీరో నాని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

''రివ్యూలు ఇచ్చేవారిని మనం ఆపలేం.. అయినా ఎవరినని ఆపుతాం.. ఎంత మందినని ఆపుతాం.. అది జరిగే పని కాదు. కానీ మంచి సినిమాలకు నెగిటివ్ రివ్యూలు ఇవ్వకూడదు. ఒకవేళ ఇచ్చినా అది వ్యక్తిగత అభిప్రాయం లాగా ఉండాలి కానీ.. అందరి అభిప్రాయం ఇదే అనే కోణంలో రుద్దొద్దు. ఇటీవల ఫస్ట్ షో పడగానే కొన్ని సినిమాలను డిజాస్టర్ అని తేల్చేస్తున్నారు. ఇది సరైంది కాదు.. విడుదలైన వారం పది రోజుల తర్వాత సినిమాలకు వచ్చే అభిమానుల తాకిడి బట్టి అది డిజాస్టరా? అట్టర్ ప్లాపా అనేది డిసైడ్ చేయాలి. అందరిలా రివ్యూల్ని బ్యాన్ చేయాలి.. ఆపేయాలి అంటూ గొంతు చించుకోను కానీ.. అభిమానులను థియేటర్‌కు రాకుండా చేయొద్దని వేడుకుంటున్నాను'' అని నాని తెలిపారు.

కాగా, 'హిట్' యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న సరికొత్త చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'లో నాని కథా నాయకుడిగా నటిస్తున్నారు. శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా సిద్ధమవుతోంది. ఇందులో నాని సరసన శ్రీనిధి శెట్టి నటిస్తోంది. మే 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా 'హిట్ 3' ప్రీసేల్ బుకింగ్స్ ఓపెన్ చేయగా టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి.

# అదే గొప్ప విజయంగా భావిస్తాను

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ సాయి పల్లవి ఇటీవల 'తండేల్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నాగచైతన్య హీరోగా నటించిన ఈ చిత్రాన్ని చందూ మొండేటి తెరకెక్కించారు. అయితే ఈ మూవీ ఫిబ్రవరి 7న థియేటర్స్‌లోకి వచ్చి హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం సాయి పల్లవి వరుస చిత్రాల్లో నటిస్తూ బ్యాక్ టు బ్యాక్ హిట్స్ సాధిస్తూ దూసుకుపోతుంది. ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'రామాయణ'. రణ్‌బీర్ కపూర్ రాముడిగా నటిస్తుండగా.. కన్నడ స్టార్ యశ్ రావణుడిగా కనిపించబోతున్నాడు. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతుండగా.. ఇందులో బాబీ డియోల్ హనుమంతుడి పాత్రలో నటిస్తున్నాడు. అయితే రెండు పార్టులుగా రాబోతున్న ఈ సినిమా మొదటి భాగం వచ్చే ఏడాది మార్చి 19న విడుదల కాబోతుంది.

ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సాయి పల్లవి ఆసక్తికర కామెంట్స్ చేసింది. "నేను నా పాత్రను ఎంపిక చేసుకునేటప్పుడు కథలో లోతెంత ఉందనేది చూస్తాను. నా పాత్రకు బలమైన భావోద్వేగం ఉందా? లేదా అని చెక్ చేస్తాను. ప్రేక్షకులకు నిజాయితీ గల కథలు చెప్పాలని తపన పడుతుంటాను. నా పాత్ర తాలూకు భావోద్వేగాలతో ప్రేక్షకులు కనెక్ట్ అయ్యారంటే అదే గొప్ప విజయంగా భావిస్తాను. అందుకే నేనెప్పుడూ అవార్డుల కన్నా ప్రేక్షకుల ప్రేమను గెలుచుకోవడానికి తొలి ప్రాధాన్యత ఇస్తా. 'రామాయణ' సినిమాతో బాలీవుడ్‌కు ఎంట్రీ ఇస్తుండటం సంతోషంగా ఉంది. సీత పాత్రలో నటించడం గౌరవంగా ఉంది" అని చెప్పకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA.Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in